కథ

తే కాళ్లు తడుపుకోవాలి.

అలాంటివేమీ చేయలేదు ఆమె.

అతని మీసాలకేసి తదేకంగా చూడ సాగింది.

కనీసం ఆమె చూపుల్ని కూడా కిందకు దించలేనందుకు పట్టుదల పెరిగింది అతనిలో. చూపుల్ని మరీ వాడిగా మల్చి రెప్పలార్పకుండా ఆమెకేసి ఎర్రని మంటల్లా గుప్పించసాగాడు. అబ్బిళ్లు కొరికి గుర్లురిమాడు.

అతని మీసాలకేసే చూస్తోన్నదల్లా ఆ పాప వేలెత్తి "నీ మీసాలకు దారముంది" అంది తేలిగ్గా.

అంతవరకు బిగబట్టి వున్న అతని వూపిరి అంతా ఒక్కసారిగా గుండెల్లోంచి బైటికొచ్చింది తుస్సుమంటూ. వాడిచూపుల, కోరమీసాల స్పృహ జారిపోయింది. గండిపడ్డ చెరువులా అతని ప్రయత్నమంతా నీరుగారిపోయింది. గుండెల్లోకి చలిగాలి ప్రవేశించినట్లు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు అతను. చూపులు ముడుచుకొన్నాయి. పెదాలు సర్దుకొన్నాయి. చేయి అప్రయత్నంగా మీసాల్ని తడివింది.

చొక్కాకు చెందిన చిన్న దారపు తునక మీసాల్లో చిక్కుకొని వుంది.

తన చూపుల్లోని వాడిపట్ల సిగ్గేసింది అతనికి.

పెదాలమీద చిరుదరహాసం క్షణకాలం కదలి మాయమైంది.

పాపకేసి పరిశీలనగా చూశాడు.

మొహం పీక్కుపోయి, పెదాలు వాడిపోయి నీరసంగా కన్పిస్తోన్నా ఆ కళ్లల్లో ఏదో ఉత్సాహం.

"హుషారైన పిల్ల" అనుకొన్నాడు.

"ఏవూరికి బోవాల?" అడిగాడు.

"పోరుమామిల్ల..." చెప్పింది.

"పోరుమాల్లకా?" ఆశ్చర్యంగా చూశాడు. "మైదుకూరు దాటి పోవాల తెల్సునా?"

తెలుసునన్నట్లుగా తలూపింది.

"సుట్టాలుండారా?"

ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు ఆమె. చూపుల్ని కిటికీలోంచి బైటకు చొప్పించింది.

తనతో చనువుగా మాట్లాడలేకపోతోంది ఆమె. ఇప్పటిదాకా ప్రదర్శించబడ్డ తన మొరటుదనానికి సరైన ప్రతిస్పందన కాబోలు.

అతనికెందుకో ఆ పాప ముచ్చటగా కన్పించింది.

పోరుమాల్లకేనా? పక్క పల్లెలకా పాపా?" సౌమ్యంగా అడిగాడు.

అతని మొహంలోకి ఓసారి చూసింది ఆమె. తర్వాత చెప్పింది "పోరుమాల్లపోతే తెలుస్తది- యాడికి బొయ్యేది" అంది.

"అంటే?" అర్థంకాలేదు అతనికి.

"పోరుమాల్లలో వుందో? పక్కూర్లకు పొయ్యిందో? ఎతుకులాడాల." ముఖమ్మీద విచారపు మబ్బులు కమ్మాయి.

"ఎవురు?"

"మాయమ్మ."

"ఏంపాపా?"

"మాయమ్మకు గుబులు..."

ఆ సన్నివేశాన్ని జీర్ణించుకోలేక పోయాడు అతను.

"ఒక్కదానివే వస్తాందవా?"

"ఆ..."కళ్లార్పుతూ చెప్పింది.

ఆమె పట్ల అతని కర్కశత్వమంతా కరిగిపోయింది.

"ఏవూరు పాపా మీది?" ఆర్ద్రంగా అడిగాడు.

"కొండమోటుపల్లె" చెప్పింది.

ఆ వూరి పేరు వినగానే అతని నోటి లోంచి మరో ప్రశ్న వెలువడలేదు. మనస్సునిండా ఆలోచనలు కమ్ముకొన్నాయి.

ఆ వూరు తనకు తెలుసు.

వృత్తిరీత్యా ఒకసారి వెళ్లాడు.

వంద యిళ్లదాకా వుంటాయి. రెండో మూడో మిద్దెలు. మిగతావన్నీ బోదకొట్టాలే. ఒకరిద్దరికి బోరుబావులు కూడా వున్నట్టు గుర్తు. దాదాపు వూరంతా మెట్ట వ్యవసాయమే. వానొచ్చే పండాలి. లేకుంటే ఎండాలి.

ఆ వూరి పరిసర ప్రాంతాల్లో రెండ్రోజులు తిరిగి తను. కుంట, సత్రము, కోడి పందేలు...

అతని ఆలోచనల్తో నిమిత్తం లేకుండా మరో రెండు స్టేజీలు దాటింది బస్సు.

సీట్లకు మించి ఎక్కారు జనం.

వేగంగా వెళ్తోన్నదల్లా కీచుమంటూ ఒక్క కుదుపుతో ఆగింది బస్సు. అజాగ్రత్తగా వున్న చాలామంది ప్రయాణీకుల నుదుళ్లు ముందు సీటు కమ్మీకి కొట్టుకొన్నాయి.



సీటుమీద పడుకొని వున్న గర్భిణీస్త్రీ కిందకు జారబోయింది గాని అమ్మలక్కలు జాగ్రత్తపడి ఆపారు. ఆ కుదుపుకు నెప్పి ఎక్కువవటంతో 'ఓయమ్మో... ఓర్నాయనో... ఒరిదేవుడో...' అంటూ అరవ సాగింది.

ముందుకు దూకబోయిన పాపను లాఘవంగా పట్టుకొని ఆపాడు అతను. ఆ పనిలో- వొతికెలబడిన సంచిని ఆదరాబాదరా సర్దుకోబోయాడు.

ఆ దృశ్యాన్ని పాప గమనించింది.

అప్పుడే గర్భిణీ స్త్రీ కేకలు తారాస్థాయికి చేరుకొంటున్నాయి.

పాప నిక్కి చూడబోయి అతనికేసి చూసి ఆగింది.

అతనికి అర్థమైంది.

"సూసొస్తావా?" అడిగాడు.

తలూపి అతని పక్కనించి యిరుగ్గా దాటుకోబోతూ సంచిమీద కాలేసి ఉలికిపాటుగా వెనక్కి లాక్కొంటూ అదుపుతప్పి అతనిమీద పడింది. అతని నడుముల మీద ఆనుకొన్న ఆమె అరచేతులకు ఏదో వస్తువు గట్టిగా తగిలింది. ఆధారం కోసం పిడికిలి బిగించింది. బొడ్లోంచి జారిన వస్తువు పిడికిట్లోకి వచ్చింది.

ఆ వస్తువేమిటో అర్థమై, ఒళ్లంతా జలదరించినట్లయి, పిడికిలి వదలింది ఆమె.

ముందుకెళ్లటం చాలించి తన సీట్లోకే ముడుచుకొంది.

రహస్యం బైటపడిన భావం క్షణకాలం అతని మొహంలో కదలాడింది.

కొన్ని క్షణాల తర్వాత తనకుతాను సర్దిచెప్పుకొన్నాడు- రహస్యం తెలిసింది ముక్కుపచ్చలారని పసిపిల్లకని అర్థమై.

అయినా- తనకేసి వింతగా తడివే ఆమె చూపులకు శరీరమంతా ఎలాగో అన్పించసాగింది.

అతనికేసి నమ్మకంలేని చూపుల్ని గుచ్చుతూ వుంది పాప. ఎగాదిగా వూరకే చూడటం మొదలెట్టింది.

కొంతసేపయింతర్వాత గొంతు పెగల్చుకొని అడిగింది "నువ్వు పొదుస్తవా?" అంటూ అమాయికంగా.

"నేనా...?" తడబడ్డాడు.

"నరుకుతావా?" అవే చూపులు.

"అబ్బే... లే...లేదు..."

"అయితే మరి... బొడ్లో బాకెందుకు? సంచిలో యాటకొడేలి ఎందుకూ?"

"అవా?... అవీ... నీకెట్టా తెలును పాపా? అవి పొడిచేందుకని" అడిగాడు ఆశ్చర్యాన్ని గుప్పిస్తూ.

"నాకు తెల్సు..."

"ఎట్టా?"

"చూసినా"

"పొడుస్తాంటేనా?"

"నరుకుతావుంటే కూడా..."

ఆశ్చర్యం అధికమైంది అతనికి.

"ఎప్పుడు?"

"పెద్ద పండగరోజు"

"యాడ?" ఉత్సుకత భరించలేక పోతున్నాడు.

"మావూరి రెడ్డోరి సత్రం పక్కన సింత తోపులో... కోళ్ల పందేలకాడ..."

"ఎవుర్ని?"

"మా నాయన్ను"

గొంతులో వూపిరి అలాగే నిల్చినట్లనిపించింది అతనికి. గొంతు పెగల్చుకొని అడిగాడు "నిరుటి పెద్ద పండక్కేనా పాపా?" అని.

"ఆ..." చెప్పింది.

గాఢమైన చీకటి మేఘమేదో మెదడు మీదుగా సాగిపోయినట్లుగా అనుభూతి పొందాడు అతను. ఏవో- మరెక్కడివో ఆలోచనలు జోరీగల్లా అతని మనస్సును కమ్ముకొన్నాయి.

"మాయమ్మకు గుబులుబట్టి పూర్లమ్మటి పొయ్యింది. పోరుమాల్ల పక్కన వుండేన్నెరు. అందుకే పోతాండ" కిటికీలోంచి బైటకు చూస్తూ చెప్పింది.

"పోరుమాల్లలో మీ సుట్టాలుండారా?"

"ఊహూ... లేరు"

"మరి... బువ్వెట్టా?" గొంతు తడి తడిగా మారింది.

ఆమెనించి మౌనమే సమాధానంగా వచ్చింది. కొంతసేపయింతర్వాత చేతుల్తో కళ్లు తుడుచుకోవటం కూడా కన్పించింది.

"మీ అమ్మా నాయినోల్లకు నువ్వొక్క దానివేనా పాపా?"

"మాయన్న వున్నే"

"ఏంజేస్తాండు? సదువుతాండదా?"

"పది సాలిస్నిండు. మా నాయన్ను సంపినోన్ని సంపాలని ఎవురి జీబులెంటనో తిరుగుతాండు"

తర్వాత ఆమెతో మాట్లాడే శక్తి నశించింది అతనికి.

సీటుకు చేరగిలబడి కళ్లు మూసికొన్నాడు.

అతనికెప్పుడూ ఇట్లాంటి స్థితి ఎదురు కాలేదు.

ఇంతకుముందెప్పుడూ ఇలాంటి సంఘటనల్ని ఎదుర్కోలేదు.

తన దృష్టిలో అదిచాలా చిన్న ఒప్పందం.

అతను మామూలు రైతే. కాకుంటే- యీమధ్య తనవాళ్లందరి ప్రేరణ మీద రాజకీయాల్ని పూసుకొని ప్రెసిడెంటు దృష్టిలో దోషి అయ్యాడు.

చిన్న ఖరీదుకే... కేవలం ఐదువేలకే తనకు ఒప్పందం కుదిర్చాడు ప్రెసిడెంటు.

డబ్బుతో కటకటలాడే పరిస్థితిలో ఆ అవకాశం.

కేవలం ఐదువేలకే... ఐదువేల వెనక ఇంత చరిత్ర వుంటుందని తనూహించలేదు. ఓ యింటి యజమానిని చంపిందీ, అతని భార్యను పిచ్చిదాన్ని చేసిందీ, అతని కొడుకు భవిష్యత్తును అంధకారంగా మార్చిందీ, కూతుర్ని సుడిగాలిలో చిక్కిన వగుడాకులా తిప్పుతోందీ ఆ ఐదువేలే. ఆ చిన్న మొత్తానికి యింత పవరుంటుందని తనకెప్పుడూ అర్థానికి రాలేదు.

చేసిన పనిని గురించి తానెప్పుడూ పునర్విమర్శ చేసికోడు. వాళ్లగురించి

## పెళ్ళి తర్వాత జీవితం బావుంది



"నేను చాలా సంతోషంగా ఉన్నాను. పెళ్ళిచేసుకోవడం చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. నా జీవితంలో పెళ్ళి ఓ అద్భుతసంఘటనలా అనిపిస్తోంది. నిజం సుమీ. ఆ సంతోషం తాలూకు ఛాయలు నా మొహంలో కనిపించట్లేదూ?!" అని చెబుతోందిప్పుడు మెరుపుకలల కాజోల్. అజయ్‌దేవగన్‌ను వివాహమాడటంతో దాదాపు ఏడాదిపాటు ఎలాంటి పత్రికా ఇంటర్వ్యూలలోనూ, ఇతరత్రా వార్తా కథనాల్లోనూ కనిపించని కాజోల్ ఇటీవలే పెళ్ళయిన ఏడాదికాలం ముచ్చట్లు చెబుతోంది. గతంలో తను చీటికి మాటికి చిటపటలాడుతుండేదిట. ఇప్పుడు చాలా ప్రశాంతంగా ఉంటోందిట. ఎందుకంటే వైవాహిక జీవితంలోని సంతోషమే ఇందుకు కారణమన్నది కాజోల్ విశ్లేషణ.



3

**కథ**

వినేందుకు పొరబాటున కూడా ప్రయత్నించడు. ఇదిగో... ఇప్పుడొచ్చి పడింది యీ చిక్కు సమస్య.

అతని మెదడునిండా సముద్రాలు పోటెత్తుతున్నాయి.

పాప కళ్లు మూసికొని అలాగే నిద్రలోకి జారుకొంది.

బస్సు వేగంగా సాగిపోతోంది. గమ్యస్థానానికి దగ్గరవుతోంది.

ముందుసీటు ముసలాయన బ్రహ్మంగారి తత్వాల్ని పాడటం ఆపలేదు.

ఎవడో తాగుబోతు, కండక్టరుతో వాదనకు దిగాడు. "నువ్వు టికెట్టు అడినవుగా బట్టి నేనియ్యను. అడక్కుంటే యిసిరిపారేద్దును. నేను టికెట్టు యియ్యలేనంత పనికిమాల్నోన్ననుకొన్నెవా? నా పంచెకట్టు సూడు, నామీసం సూడు, నా యేసెం సూడు. నన్నే టికెట్టు అడుగుతవా?" అంటూ.

బస్సులోని గందరగోలమేదీ తలకెక్కలేదు 'అతని'కి. గర్భవతి కేకలు కూడా అతని మెదడులోకి జొరబడలేదు.

పాపమీది ఆలోచనలు అతన్ని అతలాకుతలం చేశాయి.

తనెందరి తలకాయలో లేపాడు. వాటి వెనక నుంచి ఇట్లాంటి చరిత్రలు తననెప్పుడూ వెదక్కొంటూ రాలేదు.

సారాయీ, రాజకీయమూ కలిసిన విషపు మత్తులో అలవాటుపడ్డ యీ వృత్తే తనకిప్పుడు జీవనాధారమైంది. నర్సిహ్మారెడ్డి మంత్రిగా వున్నప్పుడు తాము ఓ వెలుగు వెలిగారు. గ్రామ నాయకుల నించి మంత్రులదాకా తమ లక్ష్యానికి తిరుగుండేది కాదు. గురిబెట్టారంటే తల తెగిపడినట్టే.

తన రాజకీయావసరాలకు నర్సిహ్మారెడ్డి తమను బాగానే వాడుకొని వదిలేశాడు.

అలవాటుపడ్డ పని. కాయకష్టం చేసి జీవించేంత ఓపికలేని బతుకు. జీవితమిలా గడచిపోతూవుంది- సారాయి మద్య- నెత్తురు మద్య.

తన చేతి వాటానికి ఎందరి తలకాయలు రాలిపోయుంటాయో! తనకు సంబంధంలేని ఎన్ని జీవితాలు ఆరిపోయుంటాయో! పనికిముందు వాళ్లను గురించి వినేదిలేదు. పని తర్వాత వాళ్ల వెనక కుటుంబాన్ని గురించి ఆలకించేదిలేదు. అదేపనిగా వచ్చి చెప్పబోయినా చెవిఒగ్గేదిలేదు. కరవులోపడి నలిగే తమకు బతుకుదెరువు మార్గంగా యీ పనిని అప్పజెప్పేటపుడు అంత కఠినశిక్షణఇచ్చాడు మరి నర్సిహ్మారెడ్డి!

ఇప్పుడోపిల్ల వచ్చి ఓ పెద్ద చిక్కుప్రశ్నలా తనపక్కన కూచుంది. వినకూడని విషయాన్ని వినేటట్లు చేసింది.

ఈ షాక్‌నించి బైటపడాలంటే నిషా ఎక్కించాల్సిందే.

తను ఒప్పందం చేసికొన్న పనిని పూర్తి చేసికోవాలంటే సారాయి తాగాల్సిందే.

తలంతా గజిబిజిగాతయారైంది అతనికి.

మందుపడకుంటే ముక్కలై రాలిపోతూవున్న మెదడుమళ్లీ ఒకటిగాఅతుక్కోదు. గమ్యం దాకా ఆగలేదు. మద్యలో దిగి తాగాల్సిందే.

తొడమీద మెత్తగా తట్టినట్లుగా అన్పించి కళ్లు తెరచి అటుకేసి చూద్దామని విరమించుకొన్నాడు. 'బహుశా పాప ఏదో రాగం దీస్తూ పొరబాటున తన తొడమీద దరువేస్తూ వుంటుంది.'

కొంతసేపయింతర్వాత మళ్లీ అదే స్పర్శ. ఆ వెనకే పిలుపు.

కళ్లు తెరచి ఆమెకేసి చూశాడు.

"నువ్వేడకు బోవాల?" అడిగింది.

"గిద్దలూరు" చెప్పాడు.

"పోరుమాల్ల దోవన్నేనా?"

"ఆ..."

ఆ పాప కళ్లలో మెరుపు కన్పించింది. "పోరుమాల్లలో నాకెవురూ తెల్దు. నాతోబాటు నువ్వూ దిగి, మాయమ్మను ఎతుకులాడి సూపిన్నా!" అడిగింది.

అతనుమళ్లీ సీటువెనక్కి జారగిలబడ్డాడు.

మరో గంటలో తను గిద్దలూరు వెల్తాడు. తర్వాత గంట సమయం కూడా పట్టదు తన పనయిపించుకొనేందుకు.

"నిన్న పొద్దున సద్దిబువ్వ తిన్నె. మాపిటేల మాయన్న జీపుకుపోతా పదిరూపాయలిచ్చిండు బువ్వదినమని. నేనది దాపెట్టుకోని పొద్దున్నే బసెక్కినా. మాయమ్మన్సూడాలన్నా!" ఆమె గొంతు దీనంగా పలికింది. అతని చూపుల్ని వడేసి లాక్కొని తనకేసి తిప్పుకొని, తన కనుకొలుకుల్లోంచి జారే కన్నీటి బిందువుల్ని చూపించింది.

అతని గుండె జలదరించింది.

అప్పుడే ఆడాళ్లమద్య ఒక్కసారిగా కలకలం రేగింది. గర్భిణీ స్త్రీ సీటు చుట్టూ చీరల్ని పరదాలుగా చుట్టారు.

కొద్దినిమిషాల తర్వాత కెవ్వుమనే నవజాత శిశువు కేకలతో బస్సంతా పులకరించింది. బస్సు పోరుమామిళ్ల చేరింది.

అతను పాపకేసి చూశాడు.

నిర్మలమైన ఆమె కనుకొలుకుల్లోంచి కన్నీటి బిందువులు చెంపల మీదుగా తేమదారుల్ని దిద్దుతున్నాయి.

"మాయన్న కనపడ్తే మల్లా బువ్వకు లెక్కిస్చుడు. దాన్ని నీకు శార్జీకి ఇస్చాలేన్నా! సూపిజ్జూరాన్నా!" లేచి చేయిపట్టుకొంది పాప.

అప్రయత్నంగానే తన చేతిలోని కండువాతో ఆమె కన్నీటిని తుడిచాడు అతను. మెల్లగా ఆమె వెనక కదిలాడు.

బస్సు దిగుతూ ప్రసవమయిన సీట్లోకి తొంగి చూశారు.

ఎర్రగా, ముద్దుగా వున్న శిశువు.

బస్సు దిగుతూనే అటుఇటు చూశాడు ఆమె కేమయినా కొనిచ్చి ఆకలి తీరుద్దామని.

ఎదురుగా తోపుడుబండి. దానిపైన అరటిపళ్ల కుప్పలు.

వాటిని చూసిన తక్షణం అతని మెదడులో విస్ఫోటనం రేగింది. చేసికొన్న ఒప్పందం అతని చెంప 'చెళ్'మనిపించింది. బండినిండా అరటి గెలలతో పల్లెనించి గిద్దలూరుకు వచ్చే రైతు తన కళ్లముందు కదలాడాడు. టౌను పొలిమేరల్లోనే అతన్ని అటకాయించి నాగల్లోంచి కిందకు లాగి ఒక్క వేటుతో తలనరికి, ఏర్పాటు చేసికొన్న జీపులోనో, మోటారు బైకులోనో పారిపోయి వచ్చే వ్యూహం కళ్లెదుట ప్రత్యక్షమైంది. తీసికొన్న అడ్వాన్సుతో వారంరోజులుగా తాగిన మందు, తిన్న ఆహారం, పిల్లలకు కట్టిన స్కూలు ఫీజులు, పెళ్లాం ఒంటిమీది బట్టలూ దృశ్యాలు దృశ్యాలుగా మెదడునిండా కదలాడాయి.

చిటికెన వేలు పట్టుకోబోతూ వున్న పాప ప్రయత్నాన్ని భంగపరుస్తూ పెద్దపెద్ద అంగలేసికొంటూ నేరుగా బస్టాండు పక్కనే వున్న బ్రాందిషాపులోకి అడుగేశాడు.

అతని తలలో పెద్ద గందరగోళంగా వుంది. కర్తవ్యాన్ని విస్మరించబోవటం అతనికే వింతగా వుంది. చేసికొన్న వొప్పందాన్ని కాదనటంగానీ, వాయిదా వేసికోవటంగానీ తన జీవితంలో ఎప్పుడూ జరగలేదు.

తన గురికి బలికాబోయే అతను బీద రైతే కావొచ్చు. గెనిమల వద్ద వచ్చిన చిన్న తకరారే అతని పానాలమీదికి వచ్చుండవచ్చు. అవన్నీ తనకు అనవసరం. కిరాయి తీసికొన్నాడు కాబట్టి అతన్ని చంపిరావాలి. కిరాయి ఇచ్చినవాడు తన బంధువేమీకాదు. రేపు మరొకడు వచ్చి వీడిమీదనే పని కానీమన్నా సందేహించేది లేదు.

'వందల్లో ధరపలికే గెనిమ కోసం వేలు ఖర్చు పెట్టుకొనే ఇతనూ, ప్రాణాలు పోగొట్టుకొనే అతనూ'

'రం' బాటిల్ అందుకొన్నాడు అతను.

అది తాగితేగాని తన మెదడు పన్జేయదు. అనుకొన్న పనిని అనుకొన్నట్లుగా చేసేందుకు సహకరించదు.

అక్కడే బాటిల్ ఓపెన్‌జేసి గ్లాసులోకి వొంపుకోబోతూ వుండగా 'పాప' వచ్చి అతని ఎదురుగా నిల్చుంది. "అన్నా! అన్నా!" అంటూ అతన్ని చేత్తో తాకింది.

ఆమె గొంతులో ఏదో ఆదుర్దా.

కళ్లల్లో కన్నీటి అలికిడి.

ఏమన్నట్లుగా ఆమెకేసి చూశాడు.

"అన్నా!... మాయన్నను పోలీసోల్లు పట్టకపోతాన్రన్నా!" ఏడుస్తూ చెప్పింది.

వంచబోతూవున్న బాటిల్‌ను అలాగే ఆపాడు అతను.

"అన్నా! మాయమ్మను సూపిజ్జూరాన్నా!" ఎక్కిళ్లమద్య అడిగింది ఆమె.

బాటిల్‌కు మూత బిగించి సంచిలో వేసికొని షాపులోంచి బైటకు నడిచాడు.

తను దిగిన బస్సు ఇంకా బస్టాండులోనే వుంది. మరో ఐదు నిమిషాల్లో కదలవచ్చేమో! టిఫిన్ చేసేందుకు వెళ్లిన డ్రైవర్ కండక్టర్లు ఇంకా వచ్చినట్టు లేదు.

"మాయన్న ఎవురిమీందనో బాంబులేసిండంట అన్నా. అందరూ అనుకుంటాంద్రు.

అతన్నించి సమాధానమేదీ రాలేదు.

"మాయన్న కూడా సారాయి తాగుంటాడా?" అతనికేసి తలెత్తి అడిగింది.

ప్రశ్నార్థకంగా ఆమె కళ్లల్లోకి చూశాడు.

"బాంబులెయ్యాల్సన్నే, మనసల్లు పొద్దాలన్నే ముందు సారాయి తాగాల్నంటనే!"

ఉలిక్కిపడ్డాడు అతను.

"ఎవురు జెప్పిన్రు?"

"మా నాయన సెబుతావున్నెడు"

"అబ్బే... అదేంలే... తాగినోల్లంతా పొడుస్చరా?"

"పొడ్సేవోల్లంతా తాగే పొడుస్చరంటలే..."

సమాధానం కోసం తడబడ్డాడు. "ఇదో యీ చిల్లర తీసప్పోయి పండ్లు కొనుక్కొని తిను" జేబులోంచి చిల్లర నాణేలు తీసి ఆమెకేసి చాపాడు.

"నాకొద్దు. మాయమ్మన్సూడాల. మాయమ్మ నాకు బువ్వ దెచ్చి పెడ్తది."

"సూజ్జాంలే. ముందు పండ్లు దిను."

అతని కళ్లల్లోకి ఆశగా చూసింది. "నువ్వు పోలేదా?" అంది.

"యాడికి?"

"యాడికో! ఎవుర్ని పొడ్సదానికో?"

దొరికిపోయినట్టుగా ఆమెకేసి చూశాడు.

ఏ ఆధారంలేని, ఎవరూ తోడులేని యీ పాప నిలువెత్తు ప్రశ్నార్థకమై నిలబడటం ఇబ్బందికరంగా వుంది.

ఆమె అన్న అనుకోకుండానే తన దారిలోకి వచ్చాడు.

తను చంపబోయే రైతు అతని కళ్లముందు మెదిలాడు బైటి ప్రపంచమంటే ఏమిటో తెలిసి భార్యాపిల్లలున్నవాడు 'అతని పిల్లలు కూడా రేపు వీళ్లలాగే...'

'తన పిల్లలయితే మాత్రం?'

అరటిపళ్ల బండి వద్దకు వెళ్లబుద్ధి కాలేదు అతనికి.

నేరుగా ఆపిల్ పళ్ల వద్దకు నడచి నాలుగు పళ్లను కొన్నాడు. రెండు నీళ్ల టెంకాయల్ని తీసికొన్నాడు. షాపతను కాయ నరకబోతోంటే వద్దని వారించి సంచిలో వేసికొన్నాడు.

అతను ఎక్కి వచ్చిన బస్సు బస్టాండులోంచి కదలి దుమ్ము రేపుకొంటూ వాళ్లను దాటి వెళ్లింది.

పెద్దగా ఒకసారి నిట్టూర్చి పాపచేతిని పట్టుకొని దగ్గర్లోని స్కూల్‌గ్రౌండ్‌లోకి తీసికెళ్లాడు. అక్కడొక మూలగా ఇద్దరూ కూచున్నారు.

పిడిబాకుతో ఆపిల్ పండ్లను చీల్చి పాపకు అందించాడు.

సంచిలోని వేట కొడవలితో టెంకాయ తల పగులగొట్టి పాప నోటికి అందించాడు.

"భలే... భలే... బాగుందన్నా!... యీ కత్తులు ఇందుకూడా పనికొస్తయా!" ఆనందంగా, ఆశ్చర్యంగా అంది పాప.

ఆమెకేసి తన్మయంగా చూస్తూండి పోయాడు అతను. ●

## సృజనాత్మకతను పెంచే 'ఎక్సర్‌సైజ్'

*ఎక్సర్‌సైజులు చేయటం వల్ల శారీరక ఆరోగ్యానికి ఎన్నెన్నో మేళ్లు జరుగుతాయని అందరికీ తెలిసిన విషయమే. ఎక్సర్‌సైజుల వల్ల కలిగే ప్రయోజనాల్లో మరొక కొత్త 'శక్తి' చేరింది. అది సృజనాత్మకశక్తి. ఎక్సర్‌సైజులు చేయటం వల్ల క్రియేటివిటీ పెరుగుతుందట. దాంతోపాటే ఒరిజినాలిటీ కూడానట. కొత్తమంది స్త్రీ పురుషులపై ఈ ప్రభావాన్ని అధ్యయనం చేసిన బ్రిటిష్‌రీసెర్చర్లు, ఎరోబిక్ క్లాసుల తర్వాత క్రియేటివిటీ టెస్టులకు హాజరయిన వారు, అప్పటిదాకా విడియోచూస్తూ గడిపినవారికన్నా ఎక్కువ స్కోరు చేశారని అంటున్నారు. ట్రెడ్ మిల్ మీద ఎలుకలను ఉంచి, వాటిపై ఎక్సర్‌సైజుల ప్రభావాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలకు వాటి మెదళ్ళలో బ్లడ్‌సెల్స్ పెరగటం గమనించారు. అలా జరగటంతో వాటి కండరాల శక్తి కూడా బాగా పెరగటం జరిగింది. సో...ఎక్సర్‌సైజుల వల్ల బ్రెయిన్‌కు కూడా బలమట!* ●